


"మేడమ్!"

బట్టలషాపులో, బట్టలు కొంటున్న లలితమ్మ తిరిగి చూచింది. ఆమెకా కొద్ది దూరంలో, అదే షాపులోని మరో వింగ్‌లో చీరెలు సెలెక్టుచేస్తున్న ఓ యువతి చిరునవ్వుతో కనిపించింది! మెరూన్ ఎల్లో ప్యూర్ క్రేప్‌సిల్కు చీరె, తెల్లజరీఅంచు పట్టు జాకెట్టూ, మెడలో రవ్వల నెక్లెస్, చేతులకు కెంపుల గాజులతో, అపర మహాలక్ష్మిలా వెలిగిపోతున్న ఆ యువతి ఎవరో గుర్తుకురాలేదు లలితమ్మకు! ఆవిడ పిల్చింది తనను కాదేమోనన్న వూహ కూడా కలిగింది. ఆవిడ మీదనుంచి దృష్టి మరలించుకుని, సేల్స్‌బోయ్‌తో "ఈ పంచలచాపూ, ఈ నేత చీరె, రెండు జతల లక్కా ర్లూ, చొక్కాలూ పేకెట్టు కట్టించండి. బిల్లు ఇస్తాను!" అంది.

"మేడమ్! నన్ను గుర్తుపట్టలేదూ?" మెల్లిగా భుజంమీద చెయ్యివేసి అడుగుతున్న ఆ యువతి వేపు విస్మయంగా, పరీక్షగా చూచింది లలితమ్మ. మనస్సు జ్ఞాపకాల దొంతరలను వెదుకుతోంది.

నన్ను మీరు గుర్తు పట్టకపోయినా వెయ్యిమందిలో వున్నా మిమ్మల్ని నేను గుర్తించగలను మేడమ్.... మెడమీద పడకుండా, మరీ మీద మీదకు కాకుండా, ఆరు పిన్నులతో అందంగా అమర్చుకుంటే మీ జుట్టు ముడి మిమ్మల్ని పట్టిస్తుంది..."

చప్పున జ్ఞప్తికి వచ్చింది లలితమ్మకు! వెంటనే ఆనందాతిశయంతో ఆమె పెదవుల మీద చిరునవ్వు వెలిగింది.

"ఓ! అరుణా! నువ్వామ్మా ఇలా మారిపోయావ్! నేనసలు గుర్తించలేకపోయాను! కాకున్నా కాస్త చత్వారం కూడా వచ్చేసిందీ మధ్య!" లలితమ్మ నొచ్చుకుంది! ఎన్నో సంవత్సరాల తర్వాత చిన్నబిడ్డను కళ్ళతో చూచే అవకాశం లభించిన మాతృహృదయపు ఆనందం ఆమె కళ్ళలో ప్రతిఫలిస్తోంది!

---

పవని నిర్మల ప్రభావతి

---

"అమ్మగారూ! ఈ ఆరు చీరెలూ, గ్రేజ్ పీస్‌లూ ప్యాకెట్ కట్టమన్నారా?" సేల్స్ బోయ్ వినయంగా అడిగాడు అరుణ నుద్దేశించి.

"ఆ! ఆ ఎనిమిది గజాల కంచి పట్టు చీరె కూడా కలిపి ప్యాక్ చెయ్యి మేడమ్! మీరేం ఖరీదు చేస్తున్నారో చెప్పండి. సెలెక్టు చేసేసుకుని త్వరగా వెళ్దాం! బయట కారుంది!" అరుణ గడగడ చెబుతోంది

షాపులోని అందరి కళ్ళూ తమిద్దరిమీదే ఉండటం లలితమ్మ గమనించకపోలేదు! బిల్లు చెల్లించబోయిన లలితమ్మను వారించింది అరుణ! "అదలా వుండనీ మేడమ్! నరసింహం! ఈ ప్యాకెట్ బిల్లు కూడా మా అకౌంటులో వెయ్యి..." అంది హుందాగా షాపు ఓనర్‌తో!

"అదేమిటరుణా!" అడ్డు చెప్పబోతున్న లలితమ్మ మాటలకు అడ్డొస్తూ, "అదంతేలెండి మేడమ్! మీరు రాండి."

ఇక రాననటానికి అవకాశం కూడా ఇవ్వలేదు అరుణ.

కారులో అరుణ ప్రక్కన కూర్చున్న లలితమ్మ హృదయంలో ఎన్నో ఆలోచనలు రేగుతున్నాయి. షాపు యజమాని స్వయంగా పేకెట్లు పట్టుకవచ్చి కారులో పెట్టాడు.... "మళ్ళీ సంక్రాంతి పండుగకు తమరు మా షాపుకు దయచెయ్యాలి! కొత్త డిజైన్లకు ఆర్డర్లిచ్చి వున్నాం. ఈలోగా ఎప్పుడే కంబట్టలు కావాలన్నా ఫోన్ చేస్తే చాలు, స్వయముగా తమ ఇంటికి పట్టుకురాగలం...."

"అలాగే!" హుందాగా తల ఊపింది అరుణ! కారు మెత్తగా వెళ్తోంది

"మేడమ్! ఇక్కడుంటున్నారా మీరు? నా అడ్రస్ తెలీలేదా? లేక ఈ అల్లరి పిల్ల అరుణని మర్చిపోయారా? నిజం చెప్పండి మేడమ్! ఈ పదేళ్ళలో ఏ ఒక్కసారైనా నేను మీకు గుర్తొచ్చానా? ఈ రోజైనా షాపులో నేను మిమ్మల్ని చూశాను కాబట్టి సరిపోయింది. లేకుంటే మనమసలు కలుసుకునేవాళ్ళమే కాము కాబోలు."

అరుణలో సంతోషమూ, ప్రేమా, ఉత్సాహమూ సమపాళ్ళలో ఉరకలు వేస్తున్నాయి.

లలితమ్మ వాత్సల్యంగా అరుణ వీపు నిమిరింది "ఎన్నోమార్లు స్మృతి పథంలో మెదిలేదానివి అరుణా! రెండేళ్ళ క్రితం, మా బంధువులమ్మాయి పెళ్ళికి విశాఖ వెళ్ళినప్పుడు, మీ అమ్మగారు కన్పించారక్కడ. పెళ్ళికొడుకువేపు బంధువులతో వచ్చారట! నిన్నుగురించి అడిగితే, నువ్వూ, మీవారూ ఫారిన్‌లో వున్నారని, బహుశా ఓ సంవత్సరం తర్వాత వస్తారనీ చెప్పారు మీ అమ్మగారు. ఇంతకూ పిల్లలా?" మాట మారుస్తూ అడిగింది లలితమ్మ!

"ఒక్క బాబు! ఏడో సంవత్సరం వచ్చింది వాడికి మదనపల్లిలో కాన్వెంట్‌లో చేర్పించాము. అప్పుడప్పుడూ నేనూ, వారూ వెళ్ళి చూసొస్తుంటాం! ఈమధ్యనే ఇక్కడ బంగళా కొని సెటిల్ అయ్యాం మేడమ్! అన్నట్లు.... మీ తమ్ముడు రామకృష్ణ ఏం చేస్తున్నాడు? పెళ్ళయిందా? పిల్లలా?" ఆ ప్రశ్నల్లో కేవలం యోగక్షేమాలు విచారిస్తున్న ధ్వని తప్ప, ఏలాటి ఉద్రిక్తతా లేకపోవటం, లలితమ్మను ఆశ్చర్యంలో ముంచెత్తింది క్షణకాలం.

"ఇక్కడే ఓ ఆఫీసులో గుమస్తాగా వుంటున్నాడు. వాళ్ళావిడపేరు కల్యాణి ఆ అమ్మాయికూడా అదే ఆఫీసులో టైపిస్ట్‌గా పనిచేస్తోంది. ఇద్దరు మగపిల్లలు."

"మీరింకా లెక్చరర్‌గానే పనిచేస్తున్నారా మేడమ్! ఏమిటో చాలా పెద్దవారుగా మారిపోయారు మేడమ్!"

లలితమ్మ చిరునవ్వు నవ్వింది! "వయస్సు ఎక్కువౌతున్న కొద్దీ, మనిషిలో మార్పురాదా అరుణా? ఓపిక లేక ఉద్యోగం మానేశాను... కానీ ఈ మధ్యే ఏమీ తోచకపోవటంతో, చిన్న ట్యుటోరియల్ కాలేజి ఒకటి పెట్టాను ఆడ పిల్లలకు ప్రత్యేకంగా! ఇద్దరు బి. ఇడి టీచర్సును నాకు సాయంగా పెట్టుకున్నాను. వాళ్ళిద్దరూ టీచ్ చేస్తారు సాధారణంగా! ఎప్పుడేనా ఓపిక, హుషారు వున్నప్పుడు ఒక అవర్ క్లాసు తీసుకుంటాను నేను. అంతే!" ఇంద్రభవనం లాటి బంగళా ముందు ఆగింది కారు.

"రాండి మేడమ్!" అనుసరించింది లలితమ్మ.

"వీరే మావారు మోహన్‌రావు. వీరు, నే కాలేజిలో చదివే రోజుల్లో మా మేడమ్ లలితమ్మగారు... నాకు మదర్ లాటి వారు కూడా."

హాల్లో సోఫాలో కూర్చుని అరుణ రాక కోసం ఎదురుచూస్తున్న అందమైన యువకుడు. మోహన్‌రావు చిరునవ్వుతో చేతులు జోడించాడు, అరుణ పరిచయంతో! క్షణంలో లలితమ్మలో ఎన్నో భావాలు రేగాయి. అందంలో, ఐశ్వర్యంలో, మోహనరావు పక్కన, రామకృష్ణను నిలబెడితే, ఎంతో తేడా స్పష్టంగా కనపిస్తుంది.

అరుణ గబగబా కబుర్లు చెబుతోంది ఆగకుండా. కూల్ డ్రింక్‌లూ, యాపిల్ ముక్కలూ, ద్రాక్ష పండ్లూ, అన్నింట్లో తన అనురాగాన్ని నింపి, వద్దన్నా తినిపిస్తోంది.

"అరుణా, రామకృష్ణ, కల్యాణి నాకోసం ఎదురు చూస్తుంటారమ్మా! చీకటి పడబోతుంది కూడాను. ఎలాగూ ఇక్కడే వుంటాంగా! మరోసారి తీరికగా వచ్చి, నీవు కోరినట్లే, మీ ఇంట్లోనే భోజనం చేస్తాను. సరా!" అంది లలితమ్మ. అతి కష్టంమీద అంగీకరించింది అరుణ.

ఓ వెండి పళ్ళెంలో కంచిపట్టుచీర, పట్టు రవికెల గుడ్డ, తాంబూలం పట్టుకు వచ్చింది అరుణ, లలితమ్మ నుదుటను బొట్టుపెట్టింది.

"ఇవన్నీ ఎందుకమ్మా!" ఆశ్చర్యంగా చూస్తూ అంది లలితమ్మ.

"అడ్డుచెప్పకండి మేడమ్!" అరుణ కంఠస్వరం కంపిస్తూంది ఆర్ద్రంగా. అరుణ చేతులు, లలితమ్మ పాదాల మీద మృదువుగా రాస్తున్నాయి, పసుపురాసే నెపంతో! మెల్లిగా అంది అరుణ.

"ఆ నాడు మీరు వ్రాసిన ఉత్తరం చదువుకుని, మిమ్మల్ని ఎంతగానో తిట్టుకున్నాను, మీ రెంతటి కఠినాత్ములనో నిందించాను మేడమ్! కానీ... కానీ తర్వాత అర్థమయింది

...కు, మీరు నాకు దూరంగా వెళ్ళినా, నామీద ఎంత వాత్సల్యంతో దీవెనలు కురిపించారో, ఎంత చక్కటి వరం ప్రసాదించారో. నా అవివేకతకు, మిమ్మల్ని అర్థం చేసుకోలేక పోయిన నా తెలివితక్కువ తనానికి, ఎంత గానో పశ్చాత్తాప పడ్డాను మేడమ్ ఈ పదేళ్ళ లోనూ, చల్లని సాయంసమయాలలో, ప్రశాంతమైన వెన్నెల రాత్రులలో, అమృత వాహినిలాటి నా ఈ జీవిత వాహినిలో, అను క్షణం మిమ్మల్ని తలుచుకుంటూ వున్నాను. మేడమ్ ! మీరు పెట్టిన దీపమే ఇది. ఈ స్వర్గ తుల్యమైన జీవితం, నా ఐశ్వర్యం, ఆనందం అన్నీ మీ దానాలు. నాకు పరో క్షంగా ఉత్తరం ద్వారా ప్రసాదించిన వరాలే మేడమ్."


అరుణ కళ్ళలో నీళ్ళు తళతళ లాడుతున్నాయి. పసుపురాయటం అయిపోయినా, ఇంకా ఆమె చేతివ్రేళ్ళు లలితమ్మ పాదాల్ని మృదువుగా స్పృశిస్తూనే వున్నాయి.

"పిచ్చితల్లి !" లలితమ్మ కళ్ళు ఆనందంతో వర్షించాయి "నా వరమేమిటమ్మా ? భగవన్నిర్ణయం ! నీ అదృష్టం నా శిష్యురాలు ఇంతటి ఉచ్ఛస్థితిలో వుండటమూ, ప్రశాంతమైన, సుఖప్రదమైన వైవాహిక జీవితం గడపటం, కళ్ళారా చూస్తున్న నా హృదయం సంతోషంతో ఉప్పొంగిపోతోంది అరుణా ! భగవంతుడు, ఇలాగే నీ జీవితాన్ని చల్లగా హాయిగా సాగేలా చూడాలని నిండు మనసుతో కోరుకుంటున్నానమ్మా !"

అరుణ లలితమ్మ వేపు చూసింది ! అరమోడ్పు కన్నులతో కూర్చుని, తనతలమీద చేయివేసి నిమురుతున్న ఆమె ముఖం, ముల్లోకాలకూ తల్లిఅయిన జగజ్జనని ముఖారవిందంలా కన్పించింది క్షణకాలం.

కారులో రెండు బుట్టలనిండా రకరకాల పండ్లూ, ఓ బుట్టనిండా పూలూ పట్టుకవచ్చి పెట్టాడు నౌకరు. లలితమ్మ వారించలేదు. గేటు వరకూ కారు వెంట వచ్చి సాగనంపారు అరుణ, రామమోహన్‌లు.

కారు మెత్తగా వెళ్తోంది. అందాకా ఓ విధమైన మైకంలో వున్నట్టున్న లలితమ్మ హృదయం మెల్లిగా మామూలు పరిస్థితిలోకి వచ్చింది. అరుణను తల్చుకుంటున్నకొద్దీ




కలుగుతున్న ఆనందాతిశయంతోపాటు, రామకృష్ణ జీవితాన్ని గురించిన మీమాంస కూడా మెల్లగా బయల్దేరింది ఆమెలో ! ఒక్కొక్క సంవత్సరంగా, పది సంవత్సరాలు వెనక్కు వెళ్ళిందామె హృదయం. ఆ సంఘటనలన్నీ దృశ్యాలుగా కన్పిస్తున్నాయి ఆమె మనోనేత్రంముందు.

* * *

సరిగ్గా పది సంవత్సరాల క్రితం....

ఆ రోజు.... లాన్ మీద పడుతున్న సాయంసమయపు సూర్యకిరణాల వేపు చూస్తూ వరండాలో కుర్చీలో కూర్చుని ఏదో ఆలోచిస్తోంది లలితమ్మ.

"మేడమ్ ! మేడమ్ ! మీతో మాట్లాడాలండీ !" అరుణ కంగారుగా గేటు తోసుక త్వరత్వరగా రాబోయింది. కానీ గేటు ప్రక్కనున్న ఇనుప తీగె కంచెకు, ఆమె జార్జెట్ చీరె చెంగు తగులుకుని పర్రున చిరిగింది.

"మెల్లిగా ! మెల్లిగా ! ప్చ్ ! ఎలా చిరిగిపోయిందో చూడు పమిటి కొంగు !" మందలింపు ధోరణిలో నొచ్చుకుంటూ అంది లలితమ్మ.

"హుం ! జీవితమే చిరిగిపోతుంటే, వెధవ పమిటకొంగు చిరిగితే ఏంపోయిందిప్పుడు ?" నిస్పృహగా అంటూ లలితమ్మ పక్కనున్న మరో కుర్చీలో కూర్చుంది అరుణ ! అందంగా వున్న ఆ అమ్మాయి ముఖమంతా చిరుచెమటలతో తడిసి, మంచు బిందువులతో నిండిన అరవిరిసిన లేత గులాబి పువ్వులా ఉందనిపించింది లలితమ్మకు. కానీ అరుణ గొంతులో కొత్తగా ధ్వనిస్తున్న నిస్పృహ, ఆమెలో నవ్వునూ, ఆశ్చర్యాన్నీ తెప్పించింది.

"అలా నవ్వకండి మేడమ్ ! మీకన్నీ నవ్వులాటగానే ఉంటాయి !" బుంగమూతితో కోపంగా అంటున్న అరుణను చూస్తుంటే మరి నవ్వాగలేదు లలితమ్మకు !

"అది కాదమ్మా అరుణా ! అసలు సంగతేమిటో చెప్పకుండా ఏమేమిటో ఆ'నొటేషన్స్' వల్లిస్తే నేనేం చెయ్యను మరి ? ఇంతకూ సంగతేమిటి ?"

"రేపు నన్ను చూడటానికి పెళ్ళివారొస్తున్నారు ! ఆ రాబోయే వరుడు మోహన్‌రావుట ! ఇంజనీరు ! చాలా ఆస్తిపరులు అతగాడి తలిదండ్రులు ! మోహన్‌రావొక్కడే సంతానం....అతనికే ఇచ్చి నన్ను

వివాహం చేసేట్లు నాన్నగారు, అమ్మా నిశ్చయించేశారుట కూడా ! రేపీ పెళ్ళిచూపులు ఓ తంతు మాత్రమే!" ఆవేశంగా చెప్పింది అరుణ.

"అయితే" అర్థంగాక అడిగింది లలితమ్మ !

"నా కిష్టంలేదు మేడమ్ !" బెదురుగా చూస్తూ అంది అరుణ.

"ఏం ? మోహన్‌రావు అందంగా ఉండడా ?"

"ఉంటాడుట."

"మరి ?"

"ఏమో నా కిష్టంలేదు."

"ఏమిటి పెళ్ళా ? పెళ్ళికొడుకా " రెట్టించి అడిగింది లలితమ్మ.

"రెండూను."

"మరి ఆ సంగతి మీ అమ్మగారితో చెప్పలేక పోయావా ?" అన్నివిధాలా అనుకూలమైన ఆ సంబంధం అరుణ ఎందుకు వద్దంటుందో, ఆ విషయం ప్రత్యేకించి తనకు చెప్పుకోవటానికి ఇంత ఖంగారుగా ఎందుకు వచ్చిందో బోధపడటంలేదు లలితమ్మకు.

"చెప్పాను మేడమ్."నవ్వి వూరుకుంది. 'నీకేం తెలుసమ్మా నీ బాగోగులు ? మాకు తెలుసులే.' అనేభావం నిండివుందానవ్వులో. పైగా మా అమ్మేమందో తెలుసా ?"కావలిస్తే నీకా-బోయే వరుడు మోహన్‌రావుని గురించి. వివరంగా మీ మేడమ్ లలితమ్మగారితో చెప్పు. ఆవిడ నీకీ సంబంధం తగదు, అని చెబుతుందేమో అడుగు. అలా ఆవిడ చెప్పిందంటే, మేం ఇచ్చిన మాట తప్పి అయినా, ఈ పెళ్ళి ఆపేస్తాము. సరా ?" అంది ఇందాక నా మారాం పడలేక ! అందుకే నేను మీ దగ్గరకు వచ్చాను మేడమ్."

లలితమ్మ ఆశ్చర్యంగా వింటోంది.

"మీ సలహాకూ, మీకూ, మా నాన్నగారూ, అమ్మా ఎంత విలువ ఇస్తారో మీకు తెలుసు మేడమ్ ! ఒక్కసారి నాతోపాటు మా ఇంటికి రాండిప్పుడు. ఈ పెళ్ళి ఆపమని చెప్పండి మేడమ్ !" లలితమ్మ రెండు చేతులూ పుచ్చుకొంటోంది అరుణ !

తెప్పరిల్లింది లలితమ్మ. "ఏమిటరుణా నువ్వంటున్నది ? పెళ్ళి ఆపమని చెప్పనా? ఎందుకని ? అసలు అలా చెప్పటానికి కారణాలు నేనైనా తెలుసుకోవాలిగా ? నువ్వు చెప్పిందాన్నిబట్టిచూస్తే మీ అమ్మా నాన్నగార్ల నిర్ణయంలో తప్పేమీ కన్పించటం లేదు ! మరి నేనెలా చెప్పను ?" అంది.

అరుణ మౌనంగా ఉండిపోయింది.

లలితమ్మలో ఏవేవో సందేహాలు చిక్కిరిబిక్కిరిగా రేగుతున్నాయి ! అన్నివిధాలా చక్కగా వున్న సంబంధాన్నెందుకు తిరస్కరిస్తోంది అరుణ ? అంత బలవత్తరమైన కారణమేమిటి ? కొంపదీసి అరుణ ఎవరినేనా ప్రేమిస్తోందా ? బి. ఏ ప్యాసైందన్నమాటేగానీ, అమాయకత్వం ఏమాత్రం తగ్గని అరుణలో అన్ని భావాలకు, చోటున్నదా ?

"ఏమిటి మేడమ్ ఆలోచిస్తున్నారు ?" మెల్లిగా అడిగింది అరుణ.

"ఈరోజు నీ ప్రవర్తన నాకు వింతగా ఉన్నదరుణా ! నిజం చెప్పు. ఎందుకు నీకీ పెళ్ళి ఇష్టంలేదు. ఆ విషయం నా చేత చెప్పించి పెళ్ళి ఆపించాలనే ఉద్దేశ్యం నీకెందుక్కలిగింది ?" కాస్త కటువుగా అడిగింది లలితమ్మ ! తలొంచుకుని మెల్లిగా గొణిగింది అరుణ.

"నేను ...నేను మీ రామకృష్ణను వివాహం చేసుకోదలిచాను మేడమ్" నెత్తిన పిడుగు పడ్డా అంతగా చలించదేమో లలితమ్మ ! ఆ ఒక్క మాటా ఆమె నెత్తిన బండరాయిలా పడింది.

"రామకృష్ణనా ? మా తమ్ముడు రామకృష్ణనా ? ఏమిటి అరుణా నువ్వంటున్నది ? లేక నేను పొరబాటుగా విన్నానా ?" ఆశ్చర్యంతో ఉక్కిరిబిక్కిరౌతోందామె!

"లేదు మేడమ్ ! పొరబాటు వినలేదు మీరు. నిజంగానే చెబుతున్నాను. మీ తమ్ముడు రామకృష్ణనే వివాహం చేసుకుంటాను నేను. ఈ అంతస్తులూ. అంతరాలూ నాకు లెక్కలేదు మేడమ్ ! మీరు ఒక్కసారి వచ్చి మా అమ్మ నాన్నగార్లకీ సంగతి చెప్పండి ! ముందు పెళ్ళి ఆపించండి ! తర్వాత అసలు సంగతి చెప్పండి. మీ మాట తోసెయ్యరు మేడమ్ మా వాళ్ళు !" మళ్ళీ అలాగే ప్రాధేయపడుతోంది అరుణ.

శరీరమంతా చెమటలు పట్టి, కొయ్యబారినట్లయ్యింది లలితమ్మకు !

"ఏం మేడమ్! వెళ్దాం వస్తారా?" అడుగుతోంది అరుణ.

మెల్లిగా పమిటె కొంగుతో ముఖమూ,

WITH THE BEST COMPLIMENTS OF

JYOTI PHARMACEUTICALS

GULZAR HOUSE
HYDERABAD-2

మీదా తడుముకుంటూ లేచి నిల్చుంది లలితమ్మ.

"నన్ను బాగా ఆలోచించుకోనీ అరుణా! రేపు వస్తాలే!" అంది.

"నిజంగా?" సంతోషంతో కనురెప్పలు టపటప లాడించింది అరుణ.

"ఊ!" తల ఊగించి లోపలికి వెళ్ళింది లలితమ్మ. ఇక ఆమెను ఇబ్బంది పెట్టడం సబబు కాదని తోచింది కాబోలు, అరుణ గబగబ వెళ్ళిపోయింది.

అరుణ వెళ్ళింతర్వాత, మళ్ళీ వచ్చి వసారాలో కుర్చీలో కూర్చుంది లలితమ్మ! అరుణ మాటలు పదేపదే గుర్తొస్తున్నాయామెకు!

అరుణ, రామకృష్ణను ప్రేమిస్తోందా? ఎప్పటినుంచి? అసలు వీళ్ళిద్దరికీ అంత సన్నిహిత పరిచయంకూడా లేదే! ఏమిటీ విధి వైపరీత్యం? రామకృష్ణకూడా అలాంటి ఊహల్లోనే ఉన్నాడా?

తన తర్వాత ఆరుగురు బిడ్డలు పుట్టి చచ్చిపోయాక, ఆఖరున రామకృష్ణ పుట్టాడు అమ్మకు! రామకృష్ణను కని చనిపోయింది! రామకృష్ణకు ఆరేళ్ళు నిండేసరికి నాన్న చచ్చిపోయాడు! అది మొదలు రామకృష్ణను అపురూపంగా తన కన్నబిడ్డలా పెంచింది తను. తనకు పెళ్ళయిందని పేరేగాని, ఆ భర్తతో దాంపత్య జీవితం తను గడపనే లేదు! పెళ్ళయిన మరు సంవత్సరమే, అతగాడెందుకో సన్యాసుల్లో కలిసి, ఎక్కడికి వెళ్ళాడో, ఈనాటికీ జాడలేదు! మెడలో మాంగల్యం, నుదుటను బొట్టు మాత్రం తను వివాహిత అనేందుకు చిహ్నంగా నిలిచాయి.

తిన్నగా ధైర్యంచేసి ఎం. ఏ ప్యాసై లెక్చరర్‌గా చేరింది. తనను కష్టాలలో ఆదుకుని ఎన్నిమార్లో డబ్బు సాయంచేసిన అన్నపూర్ణమ్మగారికీ, రామచంద్రయ్యగారికీ తన మనసులోనే కృతజ్ఞతలు చెల్లించుకుంటూ ఉంటుందెప్పుడూ! వాళ్ళిద్దరి గారాబు బిడ్డే అరుణ! ఒక్కగానొక్క పిల్ల కలిమికి లోటులేదు. గారానికి కొదవలేదు.

తన తమ్ముడు రామకృష్ణకంటే నాలు గేళ్ల చిన్నది అరుణ. రామచంద్రయ్యగారు, అన్నపూర్ణమ్మలపై తనకున్న అభిమానానికీ కృతజ్ఞతకూ చిహ్నంగా, అరుణను తను బాగా దగ్గరకు తీసింది! అటు కాలేజీలో మేడమ్‌గారే గాక, ఇంటిదగ్గర తల్లి తర్వాత తల్లిలా అభిమానిస్తుంది అరుణ కూడా.

కానీ రామకృష్ణ తన పెంపకంలో తను ఊహించిన ఆకృతిలో తేలలేదు. అక్కా సంపాదించి పెడుతోంది అనే భరోసా! చదువుమీద శ్రద్ధలేదు. అలా అని జులాయిగా తిరుగుతాడనే నమ్మకం ఏర్పడకున్నా, ఆ మెట్టు అందుకోవటానికి ఎంతో కాలం పట్టదనే సంగతి లలితమ్మ అర్థం చేసుకుంది. ఎంత అందంగా వుంటాడో అంత బాధ్యతా రహితుడుగా తయారయ్యాడు! అస్తమానం సినిమాలూ, ఏవో చెత్త పుస్తకాలూ మినహా అతగాడికి మరో లోకమే లేకుండా పోయింది. ఎన్నిమార్లో తను మందలించింది. తిట్టింది. ఉహూఁ మౌనంగా భరిస్తాడే గానీ, తన పద్ధతి మార్చుకోవటంలేదు రామకృష్ణ! తను వాడిమీద పెట్టుకున్న ఆశలన్నీ బుగ్గిపాలు అయినాయనే బెంగతో క్రోధంతో అలమటించి పోతోంది తను!

అలాంటిది ఈనాడు అరుణ, రామకృష్ణ చేత ఆశ్రితురాలైందా? కోరి అతగాణ్ణి వివాహం చేసుకొంటానని కోరుతోంది! అందుకు తన సహకారం అర్థిస్తోంది! ఏమిటీ తమాషా?

లలితమ్మ తీవ్రంగా ఆలోచిస్తోంది! ఓ విధంగా చూస్తే, ఈ అవకాశం తను ఉపయోగించుకోవచ్చేమో? కావలసినంత సిరి! లక్ష్మిలాంటి అరుణ ఇల్లాలు! ఇక రామకృష్ణకేంకావాలి? తన తమ్ముడు దర్జాగా సిరి సంపదలతో తులతూగుతుంటే, చూచి ఆనందించటం కంటే తనకింకేం కావాలి? అరుణ కోరిక ఆసరాతో తన కోరికకూడా ఫలిస్తుంది...

కానీ..., కానీ అరుణ జీవితం? అరుణను తను కన్నబిడ్డలా ప్రేమిస్తోంది. నిజంగా తనే అరుణ కన్నతల్లి అయితే ఇంత స్వార్థపూరితంగా ఆలోచించగలదా? బి. ఏ నాలుగు సార్లు ఫెయిలయి, ఏ బాధ్యతా లేక అందం మాత్రం వున్న రామకృష్ణను తన బిడ్డకు తగిన వరునిగా నిర్ణయించగలదా? ఊహూఁ! వివేకమున్న ఏ తల్లీ చెయ్యలేదా పని!

లైటు వెలిగిస్తూ "అక్కయ్యా! చీకట్లో కూర్చున్నావేం?" అంటున్నాడు రామకృష్ణ!

ఉలికి పడి తమ్ముని వేపు చూచింది లలితమ్మ. మనోహరంగా ఉన్న రామకృష్ణ రూపం ఏ కన్నె హృదయాన్నయినా, గాలం వేసి లాగగలదు... కానీ .. కానీ... ఓ దృఢ నిశ్చయాని కొచ్చింది లలితమ్మ.

"కృష్ణా! త్వరగా వెళ్ళి ఇద్దరుకూలీలను తీసుకురా! సామాను పేక్ చెయ్యాలి. రాత్రికే మనం బయల్దేరి వెళ్ళాలి... ఊ! త్వరగా! అన్నట్లు ఎవరికీ తెలియనివ్వకు ఇప్పుడే!"

ఆశ్చర్యంగా చూస్తున్న రామకృష్ణ వేపు ఉరిమి చూసింది లలితమ్మ! "వెళ్ళు నా మాట వినవా?"

రామకృష్ణ వెళ్ళిపోయాడు. లెటర్ ప్యాడ్ తీసుకొని గబగబ ఉత్తరం వ్రాయటం మొదలెట్టింది,

"అరుణకు ఆశీర్వచనములు.

బాగా ఆలోచించిన మీదట ఈ నిర్ణయానికొచ్చాను అరుణా! పాలపొంగు లాంటి వయసు నీది. ఆ వయసులో కనిపించే ప్రతి వస్తువూ ఆకర్షణీయంగా, అందంగా కన్పించటంలో ఆశ్చర్యం లేదు. అందులోనూ యువతీ యువకులలో పరస్పరాకర్షణ బంగారు కలలు, వెండి జరీ పరదాలా అల్లుకుంటుంది! అదీ తప్పుకాదు. కానీ నాకు నువ్వూ, నా రామకృష్ణా ఇద్దరూ రెండు కళ్ళలాంటివారు! మీ ఇద్దరిమీదా నాకున్నది మాతృ వాత్సల్యమే! మీ ఇద్దరి జీవితాలూ సుఖ శాంతులతో సాగటమే నే కోరే మొదటి కోరిక!

సాయంత్రం నువ్వు వెళ్ళాక, కాస్సేపు నేనూ ప్రలోభంలో పడిపోయాను. రామకృష్ణను గురించి నీకు పూర్తిగా తెలీదు! కొండకొననుంచి అగాధాల్లో పడటానికి సిద్ధంగా ఉన్న చిన్న పసిపాపలా వుంది వాడి స్థితి! చదువు వంటబట్టలేదు. బాధ్యత లేదు. శతవిధాలా ప్రయత్నించి, వాడు మారడని తెలిసి వదిలేశాను నేను!

అలాంటి నా తమ్ముణ్ణి నువ్వు వివాహ

WITH BEST COMPLIMENTS

FOR DEEWALI

DOLPHIN LABORATORIES (P) LIMITED

3-6-561/1 HIMAYAT NAGAR

HYDERABAD-29

మాదిరే, వాడి చక్రం తిరిగినట్లే కదా! నీతోబాటు వచ్చే సిరితో, నా తమ్ముడు బ్రతుకుతూంటే చూచి ఆనందించగలను! వాణ్ణి అంతటి ఉచ్చస్థితిలో చూడట కంటే నాకు కావాల్సిం దేముందీ?

కానీ.... మరోవైపు నిన్ను గురించిన ఆలోచన నన్ను చుట్టుముట్టి, ఊపిరి సలప నివ్వలేదు అంతటి ప్రలోభంలోనూ!

నువ్వు కలిమిలో పుట్టావు. గారంలో పెరిగావు, గులాబీలా తీగావు. అలాటి నిన్ను నీ కోరిక ఆసరాతో, నా స్వార్థ చింతనతో రామకృష్ణ కిచ్చి వివాహం చేస్తే, అది కేవలం నాకన్న బిడ్డ గొంతు కొయ్యటమేనేమో! నేను చెబితే నీ కోపున వత్తిడివస్తే, నామీద ఉన్న గౌరవం, నీ మీద ఉన్న ప్రేమకొద్దీ, మీ అమ్మా, నాన్న గారూ, ఇందుకు అంగీకరిస్తారని నాకు తెలుసు కానీ.... అలాటి ద్రోహం నే చెయ్య లేను ... చెయ్యను.

తల్లిదండ్రుల తర్వాత, వారిస్థానం గురువుది! అలాటి పవిత్ర స్థానంలో ఉన్న నేను చేజేతులా నీకు ద్రోహంచేసి, నిన్ను అగాధాల్లోకి త్రొయ్యనా? కలిమి ఉంటే కావలసిన సదుపాయాల్ని కొనగలం! ఎన్నెన్నో విలాసాలూ భోగాలూ అనుభవ్వ కోగలం! కానీ స్త్రీ జీవిత పరిపూర్ణతకు ఆలంబనమైన భర్త అనురాగాని ఆ డబ్బుతో కొనగలమా!

నీ రాకతో, నీవుతెచ్చే ఐశ్వర్యంతో, రామకృష్ణ ధనవంతుడు కావచ్చు! కానీ గుణవంతుడు ఔతాడనే నమ్మకమేమిటి? ఆ డబ్బు ఆసరాతో వాడు ఇప్పుడున్న స్థితి కంటే మరింకగా దిగజారితే, ఆనాడు నీ స్థితేమిటి? అలాటి నరకంలో నిన్ను చేజేతులా త్రోసిన నా పాపానికి నిష్కృతి ఉంటుందా? ఒద్దు ఒద్దు! నా చిట్టిఅరుణా! నీ మేడమ్‌గా, నీ తల్లిగా నేనపని చెయ్యలేను!

ఇక రామకృష్ణ సంగతంటావా? వయసు పెరిగే కొద్దీ, వివేకమూ, బాధ్యతా వస్తే సంతోషిస్తాను. లేకుంటే నే చేయగలిగిందేమీ లేదు. నీ తల్లిదండ్రులు నీ క్షేమంకోరేవారు. కానీ నీకు ద్రోహం చేసేవారు కారమ్మా! వారు మనస్ఫూర్తిగా నిర్ణయించే వివాహం నీకు శుభాన్నీ, సుఖ సంతోషాల్ని ప్రసాదించగలదే గానీ, అశాంతినీ, అసుఖాన్ని కలిగించదు తల్లీ! వివాహం అన్న తర్వాత, అంతస్తుల తేడా ఉండకూడదమ్మా!

నీ ఈ వయసులో నీకు అంతస్తులూ, అంతరాలూ వాటి విలువా తెలియవు. కానీ నాకు తెలుసు అరుణా! దిగుడు బావి, చేద బావి, ఆకాశ గంగా ఒకటేనంటావా? మూడిటికీ ఎంత తేడానో చూడు!

మూడుముళ్ళూ పడ్డాక అంతరాలు గుర్తొస్తాయి. వైవాహిక జీవితంలోని మొదటి మెరుపు విరిగిపోయి_ ఆ తర్వాత జీవితంలో దంపతులకు నరకమే మిగులుతుంది.

నీ మైకం తొలగించుకో! నీ తల్లి దండ్రులను అనవసరంగా వ్యధపెట్టకు. నువ్వు బిడ్డగా వారికి తీర్చవలసిన ఋణం అంటూ ఏదేనా వుంటే, వారిని అనవసర వ్యధకు గురిచెయ్యకుండా ఉండట మొక్కటే నువ్వు చెయ్యవలసిన పని.

మేడమ్ మోసగించిందని బాధపడకు. ఎక్కడున్నా, ఎలా వున్నా సదా నీ మేలు కోరుకుంటాను.

పిచ్చి ఆలోచనలు, అఘాయిత్యాలూ చెయ్యబూనుకుంటే నామీద ఒట్టే!

ఇక ఇక్కడ ఉండటం ముఖ్యంగా రామకృష్ణను నీ ఎదురుగా ఉంచటం నాకు సబబుగా తోచటంలేదు. అందుకే ఇక్కడ నా ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళిపోతున్నాను. ఎక్కడికో ప్రస్తుతం తెలియజెయ్యను. మీ దంపతులకు నా శుభాకాంక్షలు. ఇక వుంటా."

శుభాశీస్సులతో

నీ మేడమ్

లలితమ్మ."

అంతే! ఉత్తరం అప్పటికప్పుడే పోస్టు చేసింది! రామకృష్ణ సలహా తీసుకోనూలేదు. అతగాడికా చాన్సు ఇవ్వనూలేదు. ఈ పదేళ్ళలో ఎన్నో మార్పులు జరిగాయి. ఇక్కడికి వచ్చాక ఒక సంవత్సరం మామూలుగానే జరిగిపోయింది. రెండో సంవత్సరంలో లలితమ్మకు బాగా జబ్బుచేసింది. హాస్పిటల్ లోనే నాలుగు నెలలు ఉండవలసిన స్థితి ఏర్పడింది.

లలితమ్మ జబ్బే, రామకృష్ణలో అనుకోని మార్పును తెచ్చింది. అక్క దగ్గర డబ్బు తీసుకొని ఖర్చుచేయటంలోని ఆనందమే తప్ప తను సంపాదించిపెట్టవలసిన అవసరం ఇప్పటిదాకా అతగాడికి తెలిసి రాలేదు. అది తెల్సుకున్న రామకృష్ణ పశ్చాత్తాపంతో కుమిలిపోయాడు. తన నిస్సహాయ స్థితికి, తనమీద తనకే అసహ్యం వేసిం దతగాడికి.

అంతే పట్టుదలగా చదివాడు. బి. ఏ. పూర్తిచేశాడు. ఓ ఆఫీసులో గుమాస్తాగా చేరాడు. బాధ్యతాయుతమైన వ్యక్తిగా మారాడు.

లలితమ్మకిది ఆశ్చర్యాన్ని ఆనందాన్ని కూడా కలిగించింది.

"అక్కయ్యా! ఇక నువ్వు ఉద్యోగం చెయ్యొద్దమ్మా! విశ్రాంతితీసుకో!" మొదటిసారిగా అతగాడి కొచ్చిన జీతం లలితమ్మ చేతికిస్తూ రామకృష్ణ అన్న మాటలకు ఆనందంతో మైమరచి పోయింది లలితమ్మ.

మరు సంవత్సరమే, తన ఆఫీసులోనే టైపిస్ట్‌గా పనిచేస్తున్న కల్యాణిని వివాహం చేసుకున్నాడు రామకృష్ణ!

అన్యోన్యంగా, ఆనందంగా కాపురం చేసుకుంటున్న ఆ చిన్న దంపతులను చూచి మురిసిపోయేది లలితమ్మ!

గుమ్మడి పండ్లలాటి ఇద్దరు మగపిల్లలు అల్లరిచేస్తూ ఇల్లంతా తిరుగుతుంటే, కల్యాణి "వదినా! వదినా!" అంటూ కబుర్లు చెబుతూంటే, రామకృష్ణ "అక్కయ్యా! నువ్వుపెట్టిన దీపమే ఇది!" అంటూంటే, "ఇంతకంటే కలిమీ, అదృష్టమూ మరేంకావాలి?" అనుకోవటం పరిపాటై పోయింది లలితమ్మకు.

కానీ ఒక్కోసారి అరుణ గుర్తొచ్చేది! రామకృష్ణలో ఈ మార్పు ముందే వచ్చి ఉంటే? అరుణకోరిన విధంగా, అరుణా రామకృష్ణలు భార్యాభర్తలయ్యుంటే? రామకృష్ణ ఇలాటి చిన్న ఇంట్లో, గుమాస్తా ఉద్యోగంలో ఉండేవాడు కాదేమో! కారులో.... బంగళాలో .... నౌకర్లూ దాస దాసీలూ, లక్షల డబ్బూ మధ్య ....

తన ఊహకు తనే నవ్వుకొనేది లలితమ్మ.

ఇప్పుడు రామకృష్ణ కేం లోటు?

చదువూ, సంస్కారమూ సమపాళ్లలో వున్న సమాన అంతస్తూ, ఆదరణా గల చక్కటి ఇల్లాలు కల్యాణి వుంది. కలిమి ఎక్కువ లేకున్నా, జీవితావసరాలకు లోటు లేని సంపద, అన్నిటికీ మించి అనురాగ బలం ఉన్న స్వర్గంలాంటి సంసారం! ముద్దులొలికే ఇద్దరు బిడ్డలు. ఇంతకంటే తనికేం ఆశించాలి వాడికి?

సమాంతర రేఖల్లా అంతస్తులలో, పరిస్థితులలో ఉండే రామకృష్ణ, అరుణలను తను కలిపివుంటే, వివాహానంతరం వాళ్ళిద్దరూ ఇంత అన్యోన్యంగా, హాయిగా జీవించగలిగేవారా? అసలు రామకృష్ణలో ఈనాడు తను చూస్తున్న మార్పు వచ్చేదా? ఊహూఁ

* * *

"అమ్మగారూ! ఏ నెంబరు ఇంటి దగ్గర ఆపమంటారు కారు?" డ్రైవర్ వెనక్కి తిరిగి చూస్తూ అడిగాడు.

పది సంవత్సరాల దృశ్యాలు తెరమరుగై మెల్లగా వాస్తవ ప్రపంచంలోకి వచ్చింది లలితమ్మ.

ఇంటి నెంబరు చెప్పింది.

కార్లో దిగివస్తున్న లలితమ్మనూ, ఆమె వెనకాలే పండ్లబుట్టలూ, పూలబుట్టా మోసుకు వస్తున్న డ్రైవర్‌ను చూసి క్షణకాలం ఆశ్చర్యపోయారు రామకృష్ణ, కల్యాణి.

కుర్ర కుంకలిద్దరూ పండ్లబుట్టల దికి లంఘించేరు!

"అరుణ కన్పించిందిరా బట్టలషాపులో... సనేమిరా అని వాళ్ళింటికి పిల్చికెళ్ళింది!" ముక్తసరిగా మూడు ముక్కల్లో చెప్పింది లలితమ్మ.

"అలాగా!" అన్నారిద్దరూ.

తలంటు స్నానం చేసివచ్చిన లలితమ్మ దగ్గరకు రామకృష్ణ కళ్యాణి, పిల్లలు వచ్చారు! అందరూ తను తెచ్చిన కొత్త బట్టలు కట్టుకుని ఉండటంచూచి మురిసి పోయింది లలితమ్మ!

"కల్యాణీ! అక్కయ్యకు నే తెచ్చిన చీరె తెచ్చి ఇవ్వు! ఈ రోజు దీపావళి కదూ? త్వరగా టపాకాయలు పేలుద్దాం అందరం కలిసి!" రామకృష్ణ హుషారుగా కేక వేశాడు.

సంధ్య చీకట్లు ఆవరిస్తున్నాయి! అమావాస్య గాఢాంధకారాన్ని చీల్చివేస్తూ ప్రమిదెలు వెలుగుతున్నాయి అందరి లోగిళ్ళలో. కలవారికీ లేనివారికీ సమంగా సంతోషాన్ని పంచి ఇచ్చే దీపావళి పండుగ శోభ అంతటా చిందులు వేస్తోంది.

ఇత్తడి పళ్ళెంలో నేత చీరె, గ్లాస్కో రవికె తాంబూలం తీసుకొచ్చి, లలితమ్మ కాళ్ళకు పసుపు రాసి, బొట్టు పెట్టి నమస్కరించింది కల్యాణి!

"ఇదేమిటర్రా!" సంతోషమూ ఆనందమూ కలిసి ధ్వనించాయి ఆమె కంఠంలో.

"మా శక్తి ఇంతే అక్కయ్యా!" నవ్వుతూ అన్నాడు రామకృష్ణ!

"అదే పదివేలు!" అనుకుంది లోలోపల లలితమ్మ.

పిల్లలిద్దరూ వాకిట్లో చేరి అప్పుడే మొదలెట్టారు టపాకాయలూ, కాకరొత్తులూ వంతుల వారీగా కాల్చటానికి! కల్యాణి వాళ్ళకు జాగ్రత్తలు చెబుతోంది?

చటుక్కున లలితమ్మ పాదాల దగ్గర కూర్చుని, పసుపుతో వున్న ఆమె పాదాలు మెల్లిగా రాస్తూ అన్నాడు రామకృష్ణ.

"అక్కయ్యా! ఈ నా సర్వం నువ్వు సృష్టించి ఇచ్చిందే! ఆనాడు .... ఆ రాత్రి అలా నువ్వు నన్నిక్కడికి తీసుకొని రాకుంటే, బహుశా నా జీవితంలో మార్పు వచ్చేది కాదేమో! ఓ విధంగా చూస్తే, అరుణ నా జీవితంలో ప్రవేశించకపోవటమే మేలనిపిస్తోంది. నిన్న నువ్వు చెప్పిందాన్ని బట్టి, అరుణ ఆ కలిమిలో ఈనాడు స్వర్గం చూస్తోంది. నాకు తగిన అంతస్తులో, కల్యాణితో నేను స్వర్గాన్ని చూస్తున్నాను. ఆ అంతస్తుల తేడా నువ్వానాడు గుర్తించగలిగావు కాబట్టే నా జీవితం ఈనాడింత హాయిగా ఉందనిపిస్తోంది!"

వాత్సల్యంగా రామకృష్ణ తలమీదచెయ్యి వేసింది లలితమ్మ. ఆమెకు చప్పున అరుణ గుర్తుకొచ్చింది! తనకు ఈ ఇద్దరూ రెండు కళ్ళు! ఈ రెండుకళ్ళకూ మధ్యవున్న తను ముక్కులాటిది! ఈ ముక్కు మధ్యన లేకుంటే, ఈ రెండు కళ్ళూ కలిసి, ముఖాన్నే వికృతం చేసేవేమో!

అరుణ, రామకృష్ణ అనే ఈ సమాంతర రేఖల్ని అలా ఎడంగా ఉంచటమే మేలయింది.

కలిమిలో పుట్టి పెరిగిన అరుణ కలిమితో, చెలిమిగల భర్తతో సుఖపడుతోందీ నాడు!

దారిద్ర్యతాయుతమైన సామాన్య కుటుంబంలో పుట్టి పెరిగిన రామకృష్ణ, అలాటి సంప్రదాయంలో నుంచి వచ్చిన కల్యాణిని వివాహం చేసుకుని, జీవితాన్ని అనురాగపు కలిమితో నింపుకున్నాడు! వారిద్దరి అంతస్తులూ సమాంతరాలు! తను వాటిని కలిపి వారిద్దరి జీవితాలూ వికృతం చెయ్యలేదు. సమాంతర రేఖలని కలపాలని వృథా ప్రయత్నంచేస్తే అవి వక్రరేఖలుగా మారుతాయి. ఈనాడు ఇద్దరి కిద్దరూ సుఖపడ్తున్నారు! భగవాన్! అంతే చాలు!

"ఏమిటక్కయ్యా! ఆలోచిస్తున్నావ్?" మెల్లగా అడిగాడు రామకృష్ణ అలాగే వ్రేళ్ళతో సున్నితంగా ఆమె పాదాలు రాస్తూ!

"ఏంలేదు కృష్ణా! నాదేముందిరా! ఆ దేవుడి దయ!"

వాకిట్లో పిల్లలిద్దరూ కాల్చిన పేమటపాకాయ "ఢాం" అంది ఆమె మాటలకు ప్రతిగా.

***